క్లుప్తంగా

విద్యతోనే సమాజంలో గౌరవం

మహబూబాబాద్ రూరల్ : విద్యతోనే సమాజంలో గౌరవం లభిస్తుందని కెరీర్ గైడెన్స్ మాస్టర్ ట్రైనర్లు ఖాసీంపాషా, వరుణ్ అయ్యప్ప అన్నారు. మండలంలోని కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఎంశ్రీ పథకంలో భాగంగా ఎక్స్ పర్ట్ టాక్, కెరీర్ గైడెన్స్ అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల ప్రవర్తనను తల్లిదండ్రులు, గురువులు గమనిస్తూ ఉండాలని, వారిపై పాజిటివ్ దృక్పథం కలిగి ఉండాలన్నారు. హెచ్ఎం ఎస్.రమేష్ బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంసీపీఐ ఏరియా కార్యదర్శిగా సుక్ని

కేసముద్రం : కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని సబ్‌స్టేషన్ తండా ఏరియాకు ఎంసీపీఐ కార్యదర్శిగా బానోత్ సుక్నిని నియమించినట్లు ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మంత్రిపెల్లి మొగిలి, జాటోత్ బిచ్యానాయక్‌లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీ సభ్యులుగా బానోతు సరోజ, వాంకుడోతు శ్రీను, గుగులోతు కేశ్యా, బానోతు జ్యోతిలను నియమించినట్లు పేర్కొన్నారు.

ఉదిత్‌రాజ్‌ను కఠినంగా శిక్షించాలి

మహబూబాబాద్ అర్బన్ : బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు, ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం మాయావతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ నాయకుడు ఉదిత్‌రాజ్‌ను కఠినంగా శిక్షించాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి దార్ల శివరాజు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ రెండు రోజుల క్రితం విలేకరుల సమావేశంలో ఉదిత్‌రాజ్ బహిరంగంగా అకారణంగా మాయావతి తల తీసెయ్యాలని మాట్లాడటం యావత్తు దేశంలోని 85 శాతం ఉన్న బహుజనులను, మహిళలను అవమానించడమేన్నారు. కాంగ్రెస్‌కు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఉదిత్‌రాజ్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఎస్పీ జిల్లా కార్యదర్శి గుగులోత్ నరేష్ నాయక్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గుంతల పూడ్చివేత

కురవి : సీరోలు మండలం ఉప్పరిగూడెం గ్రామంలో ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలను, అదే గ్రామానికి చెందిన సముద్రాల బాలయ్య స్వచ్ఛందంగా తన సొంత ఖర్చులతో గుంతలను బుధవారం పూడ్చివేయించారు. రహదారిపై ఏర్పడిన గుంతలతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. స్పందించిన బాలయ్య యువకులతో గుంతలను పూడ్పించారు. బాలయ్య గ్రామస్తులు అభినందించారు.

తాపీమేస్త్రీ సంఘం నూతన కమిటీ ఎన్నిక



తొర్రూరు: తాపీమేస్త్రీ సంఘం తొర్రూరు డివిజన్ నూతన కమిటీని బుధవారం పట్టణంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సోమ హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా మార్క అరుణ్‌కుమార్, కోశాధికారిగా బైన అనిల్, ఉపాధ్యక్షులుగా మొగిలి మల్లేశం, సంయుక్త కార్యదర్శులుగా నీలం పెద్ద లక్ష్మయ్య, కల్లూరి నరసింహారావులు ఎన్నికయ్యారు. తాపీమేస్త్రీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అధ్యక్షుడు హరిప్రసాద్ తెలిపారు.

సీపీఎస్ రద్దుకు పోరాడుతా

మహబూబాబాద్ అర్బన్ : ఉద్యోగ ఉపాధ్యాయుల సీపీఎస్ రద్దు కోసం పోరాడుతామని ఎమ్మెల్సీ అభ్యర్థి ఏలే చంద్రమోహన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పాత బజార్‌లో బుధవారం రాత్రి ఇంటింటికి తిరుగుతూ ఎమ్మెల్సీ ప్రచారాన్ని చంద్రమోహన్, ఉపాధ్యాయులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఆర్‌టీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, తనకు మొదటి ప్రాధాన్యతతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, సంపత్, శ్రీనివాస్, సత్యనారాయణ, బాలకృష్ణ పాల్గొన్నారు.

పాకాల ఏటికి నీటిని విడుదల చేయాలి



గార్ల : పాకాల ఏటికి ఎస్సారెస్పీ కెనాల్ నీటిని విడుదల చేసి రైతుల వరిపంటలను కాపాడాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాకాల ఏటి పరివాహక ప్రాంత భూముల్లో మండల రైతులు సుమారు 300 ఎకరాల్లో యాసంగిలో వరిపంట సాగు చేశారన్నా రు. ఫిబ్రవరిలోనే ఏటిలో నీళ్లు అడుగంటి పోయాయన్నారు.

మోతాదుకు మించితే ముప్పు

- ఎరువులు అధికంగా వాడితే పంటలకు నష్టం
- భూమి నిస్సారంగా మారే అవకాశం
- అధికారుల సూచనలు పాటిస్తే అధిక దిగుబడి



వరిపంటకు యూరియాను చల్లుతున్న రైతు

పెద్దవంగర : యాసంగి వరి సాగులో రైతులు మోతాదుకు మించి ఎరువులు, పురుగుల మందులు వాడితే పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. రైతులు ఎరువుల వాడకంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చు. రైతులు యాసంగి సాగులో ముఖ్యంగా నత్రజని ఎరువులు సిఫార్సు మేరకు మాత్రమే వేయాలి. లేకుంటే నష్టం వాటిల్లుతుందని మండల వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

12 వేల ఎకరాల్లో వరి సాగు..

మండలంలోని 26 గ్రామపంచాయతీల్లో సుమారు 12,058 ఎకరాల్లో రైతులు యాసంగిలో వరి సాగు చేశారు. వరినాట్లు పూర్తికాగానే ఎరువులు చల్లారు. ప్రస్తుతం మూడో దఫా ఎరువులను కొంతమంది రైతులు చల్లుతుండగా మరికొందరూ నాలుగో దఫా చల్లేందుకు సిద్ధమయ్యారు. వరి ఎదుగుదలకు యూరియాను అధికంగా 4 నుంచి 6 సార్లు వాడుతున్నారు. పలువురు రైతులు అవగాహన లేమితో మోతాదుకు మించి ఎరువులు వేయడంతో ఏటా నష్టపోతున్నారు. నత్రజని ఎక్కువగా వాడడంతో పంటలను చీడపీడలు ఆశించే అవకాశం ఉంది. ప్రస్తుతం రాత్రి వేళలో చలి, పగటి వేళలో అధిక ఉష్ణోగ్రతలు ఉండడంతో యూరియాను ఎక్కువగా చల్లడంతో వరి ఏపుగా పెరుగుతోంది దీంతో తెగుళ్లు అధికంగా ఆశిస్తాయి. వరిలో అగ్గి తెగుళ్లు అధికంగా ఆశించడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రైతులు అధికారుల సిఫార్సు మేరకు ఎరువులు వేయాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

చివరి దమ్ములో వేయాలి



వరి పంటకు యూరియా 72 కిలో లను మూడు సమభాగా లుగా విభజించి 26 కిలోల చొప్పున వేయాలి. సూపర్ సింగిల్ ఫాస్ఫేట్ ఎకరాకు 150 కిలోలు చివరి దమ్ములో వేయాలి. పొటాష్ 40 కిలోలు రెండు దఫాలుగా వేయాలి. యూరియాను వేప పిండితో కలిపివేస్తే ఎరువు వృథా కాకుండా మొక్కకు సక్రమంగా అందుతోంది.

– స్వామి నాయక్, ఏఓ, పెద్దవంగర

ఎరువులు అధికంగా వాడితే కలిగే నష్టాలు..

- నత్రజని ఎరువులు అధికంగా వాడడంతో భూసారం దెబ్బతింటుంది.
- పంట దిగుబడి తగ్గుతుంది.
- పెట్టుబడులు నీటి వినియోగం పెరుగుతాయి.
- పంటలు త్వరగా ఎదిగిపోయి గాలికి పడిపోతుంది.
- అగ్గి తెగులు వచ్చే అవకాశం ఎక్కువ
- వాతావరణం కాలుష్యం పెరుగుతుంది.

శివాజీని స్ఫూర్తిగా తీసుకోవాలి

ఛత్రపతి శివాజీ మహరాజ్‌ను స్ఫూర్తిగా తీసుకొని యువత ముందుకు సాగాలని పలువురు కొనియాడారు. బుధవారం ఛత్రపతి శివాజీ 394వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ ఈ రోజు దేశంలో హిందువులు స్వేచ్ఛగా జీవిస్తున్నారంటే శివాజీ మహరాజ్ చేసిన పోరాటమే అన్నారు. రానున్న రోజుల్లో హనుమాన్ భక్తమండలి ఆధ్వర్యంలో మరిన్ని ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం ర్యాలీలు, చేపట్టారు.

– సాక్షి, నెట్‌వర్క్



డోర్నకల్ : శోభాయాత్ర నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్, అనుబంధ సంఘాల నాయకులు



తొర్రూరు : వేడుకల్లో బీజేపీ నాయకులు



కేసముద్రం: పెనుగొండ గ్రామంలో..



కురవి : కాంపల్లిలో ర్యాలీ చేస్తున్న యువకులు

గిరిజన ఆశ్రమ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



మహబూబాబాద్ అర్బన్ : జిల్లాలో గిరిజన ఆశ్రమ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించి పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణతశాతం పెంచాలని గిరిజన విద్యార్థి ఉద్యమ నేతల సంఘం నాయకులు మాలోత్ శాంతి కుమార్ కోరారు. జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ కార్యాలయంలో బుధవారం గిరిజన విద్యార్థి ఉద్యమ నాయకులు గిరిజన శాఖ జిల్లా అధికారి దేశం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి బొకేను అందజేశారు. ఈ సందర్భంగా శాంతికుమార్ మాట్లాడుతూ జిల్లాలో బెస్ట్ అవైలబుల్ స్కీంతో 320 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. గిరిజన విద్యాభివృద్ధికి పటిష్టంగా పాటుపడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు కెలోత్ సాయి కుమార్, గుగులోతు సూర్య ప్రకాష్, అజ్మీరా ప్రవీణ్, పోలేపాక వెంకన్న, ప్రవీణ్, నితిన్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి



మహబూబాబాద్ అర్బన్ : జిల్లావ్యాప్తంగా కులగణన సర్వేలో పాల్గొని విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు నిధులు మంజూరు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జంజిరాల నాగరాజు, గుడిబోయిన గోపీకృష్ణ డీఈఓ రవీందర్ రెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణన విధుల్లో ఉపాధ్యాయులకు సెలవు దినాల్లో పనిచేసినందుకు నేటి వరకు నిధులు మంజూరు చేయలేదని, వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి నిధులు మంజూరు చేయాలని కోరారు.

యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

తొర్రూరు: యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని ఏడీఏ విజయచంద్ర తెలిపారు. బుధవారం డివిజన్ కేంద్రంలోని ఎరువుల దుకాణాలను ఏఓ భాస్కర్‌తో కలిసి తనిఖీ చేశారు. దుకాణాల్లో యూరియా స్టాక్ పరిశీలించడంతో పాటు రికార్డులు తనిఖీ చేశారు.

యూరియా కోసం రైతుల పాట్లు

తొర్రూరు : పట్టణంలోని పీఏసీఎస్ రైతు సహకార కేంద్రాలు, ఆగ్రోస్‌లలో యూరియా అందుబాటులో లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని రైతుబజార్‌కు యూరియా లారీ రావడంతో సమాచారం తెలుసుకున్న రైతులు కేంద్రం వద్ద బారులు తీరారు. ఒక్కొక్కరికీ రెండు బస్తాలు చొప్పున టోకెన్లు ఇచ్చి యూరియా సరఫరా చేశారు. ఆలస్యంగా వచ్చిన రైతులకు యూరియా అందక నిరాశతో వెనుదిరిగారు.

ఈ పాస్ మిషన్ ద్వారా విక్రయించాలి

నెల్లికుదురు : ఈ పాస్ మిషన్ ద్వారా రైతులకు ఎరువులు విక్రయించాలని ఏడీఏ శ్రీనివాస్ ఎరువుల షాపుల యజమానులకు సూచించారు. మండల కేంద్రంలో బుధవారం ఏఓ ఎస్‌కే యాస్మిన్, టెక్నికల్ ఏఓ కె.రాజుతో కలిసి ఎరువుల షాపులను తనిఖీ చేసి ఫిజికల్ స్టాక్, స్టాక్ రిజిస్టర్‌లు, బిల్‌బుక్‌లు, ఈ పాస్ ఎలక్ట్రానిక్ మిషన్లను పరిశీలించారు.

మంచినీటి ఎద్దడి లేకుండా చూడాలి



దంతాలపల్లి : రాబోయే వేసవి కాలంలో గ్రామాల్లో మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ వివేక్‌రామ్ అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నీటి సమస్య లేకుండా అన్ని విధాలుగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

సంక్షిప్త సమాచారం

ఆర్టీసీ ఉద్యోగులకు 'పవర్' శిక్షణ

నెహ్రూసెంటర్ : ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించేలా నైపుణ్య శిక్షణలో భాగంగా మహబూబాబాద్ ఆర్టీసీ డిపో పరిధిలోని డ్రైవర్లు, కండక్టర్లకు పవర్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఎం.శివప్రసాద్ తెలిపారు. డిపో కార్యాలయంలో బుధవారం డ్రైవర్లు, కండక్టర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఎం మాట్లాడుతూ ప్రస్తుత పరిమాణాలు, వృత్తిపరమైన సవాళ్లను ఎదుర్కొనేలా శిక్షణలో మెలకువలను నేర్పిస్తున్నామన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..

తొర్రూరు : స్థానిక ప్రాథమిక పాఠశాలలో స్వయం పారిపాలన నిర్వహించారు. హెచ్ఎంగా లలిత, డీఈఓగా ముఖేష్, ఎంఈఓగా సాయి ఈశ్వర్, ఉపాధ్యాయులుగా పలువురు వ్యవహరించారు. విద్యార్థులను హెచ్ఎం ఎం.శారద అభినందించారు.

ఎమ్మెల్సీ గెలుపు కోరుతూ ప్రచారం



గార్ల: బీజేపీ బలపర్చిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డి గెలుపు కోరుతూ మంగళవారం గార్లలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బీజేపీ నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. శివకృష్ణ, ఆర్.విమల్‌కుమార్,తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థులు ఎంపిక

పెద్దవంగర : మండలంలోని చిట్యాల జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు వర్రె వర్షిత్, ఆవుల తరుణ్ ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీల్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్) పథకానికి ఎంపిక కాగా ఉపాధ్యాయులు బుధవారం వారిని అభినందించారు. హెచ్ఎం ఎర్రోజు విజ య్‌కుమార్ మాట్లాడుతూ ప్రతిభావంతులైన పేద విద్యార్థులు చదువును మధ్యలోనే ఆపేయకుండా ఉండేందుకు ప్రభుత్వం సాకారం అందిస్తోందని తెలిపారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు

డోర్నకల్ : విద్యుత్ చౌర్యానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని విద్యుత్‌శాఖ ఏఈ కిరణ్ హెచ్చరించారు. స్థానిక మెయిన్ రోడ్డుతో పాటు పలు వీధుల్లో రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన జ్యూస్ ఫ్రీజర్లను వాటికి విద్యుత్ కనెక్షన్లను తనిఖీ చేసి మీటర్ల రీడింగ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ జ్యూస్ ఫ్రీజర్లకు విద్యుత్ కనెక్షన్ల విషయంలో జాగ్రత్తలు పాటించాలని నాణ్యమైన విద్యుత్ వైర్లను వినియోగించాలని సూచించారు.

కంకరపోసిన రహదారులపై బీటీ వేయాలి

బయ్యారం : మండలంలోని పలు గ్రామాలకు వెళ్లేందుకు బీటీ రోడ్డు వేయించాలని పీవైఎల్ రాష్ట్ర నాయకులు తుడుం వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తా రు వేయకపోవడంతో వాటిపై వెళ్లేందుకు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు.

పేదలకు అనుగుణంగా బడ్జెట్‌ను సవరించాలి

నెల్లికుదురు : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను నిరుపేద ప్రజలకు అనుగుణంగా సవరించాలని సీపీఎం మండల కార్యదర్శి ఇస్సంపల్లి సైదులు డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ రాజుకు వినతిపత్రం అందించారు.

పాఠశాలకు కొత్తకళ

కేసముద్రం : మండలంలోని పీక్లాతండా జీపీ శివారు బోడగుట్టతండాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనానికి పెయింటింగ్ వేయడంతో ఆ స్కూల్‌కు కొత్త కళ వచ్చింది. పాఠశాల భవనానికి గతంలో వేసిన పెయింటింగ్ పేలిపోవడంతో, హెచ్ఎం డి.వి రమణ తన సొంత ఖర్చులతో భవనానికి, గదుల్లో వివిధ రంగులతో పెయింటింగ్ వేయించారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



గార్ల : ఎంపీడీఓ మంగమ్మకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు



తొర్రూరు: ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

గార్ల/మహబూబాబాద్‌రూరల్/తొర్రూరు/: పెండింగ్ బిల్లులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని మహబూబాబాద్ జెడ్పీ సీఈఓ పురుషోత్తం, గార్ల, తొర్రూరు ఎంపీడీఓలకుపాయా మండలాల్లోని పంచాయతీ కార్యదర్శులు బుధవారం వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి 6 నెలలు కావస్తున్నా పంచాయతీల నిర్వహణ ఖర్చులు బయట అప్పులు తెచ్చి పారిశుద్ధ్యం నిర్వహణకు కావాల్సిన సామగ్రిని కొనుగోలు చేస్తున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కళాకారుడికి దక్కిన గౌరవం 'డాక్టరేట్'

- సన్మాన సభలో సినీ,రాజకీయ ప్రముఖులు



రాజమౌళి దంపతులను సన్మానిస్తున్న సినీ, రాజకీయ ప్రముఖులు

నెహ్రూసెంటర్ : నిరుపేద కుటుంబంలో జన్మించిన సినీ, బుల్లితెరలో రాణిస్తున్న కళాకారుడు గడ్డం రాజమౌళికి దక్కిన గౌరవమే డాక్టరేట్ అని ప్రముఖ సినీ సంగీత దర్శకుడు బోలేశావలి అన్నారు. రాజమౌళికి డాక్టరేట్ వచ్చిన సందర్భంగా జిల్లా కేంద్రంలోని పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామంలో జన్మించి బుల్లితెర నుంచి వెండితెరకు నవ్వుల జల్లులు కురిపిస్తూ తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నాడన్నారు. కళాకారుడిగా మానుకోటకు పేరు ప్రఖ్యాతలను తీసుకువచ్చారని చెప్పారు. అనంతరం రాజమౌళి దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో సినీ, రాజకీయ ప్రముఖులు కొమిరే సాకీ, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి దేవరం ప్రకాశ్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి, మున్సిపల్ మాజీ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, అజయ్‌సారధిరెడ్డి, శంతన్‌రామరాజు, సత్యనారాయణ, వెంకన్న, ఐలేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు-ప్రమాదాలు

కట్టుకాల్వలో పడి వ్యక్తి మృతి

నెల్లికుదురు : ప్రమాదవశాత్తు కట్టుకాల్వలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని మేచరాజుపల్లి శివారు పడమటిగడ్డ తండాలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు కథనం ప్రకారం.. పడమటిగడ్డ తండాకు చెందిన జాటోతు రెడ్డి (28) తండా పరిధిలోని ఆకేరువాగులో విద్యుత్ షాక్‌తో చేపల వేటకు మరికొంత మందితో కలిసి వెళ్లినట్లు తెలి పారు. చేపలు పట్టడానికి పెట్టిన విద్యుత్ షాక్ గురై వ్యక్తి మృతి చెందాడు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నట్లు సమాచారం. ఈ విషయమై ఎస్సై చిర్ర రమేష్ బాబును వివరణ కోరగా మృతి చెందిన విషయం వాస్తవమేనని మృతుని వైపు నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ట్రాక్టర్‌పై నుంచి పడి మహిళ ..

తొర్రూరు రూరల్: ట్రాక్టర్‌పై ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు ఓ గిరిజన మహిళ కిందపడి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండలంలోని మడిపెల్లి శివారులో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై రాంజీనాయక్ కథనం ప్రకారం.. నెక్కొండ మండలంలోని ఇంద్యాతండాకు చెందిన బానోతు మంజుల (30) నెల్లికుదురు మండలంలోని ఎర్రబెల్లిగూడెం శివారు సొసైటీ తండాలోని తమ బంధువుల ఇంట్లో జరుగుతున్న పెళ్లికి వచ్చింది. ట్రాక్టర్‌లో తమ బంధువులతో పాటు పెళ్లికూతురు గ్రామమైన రాయపర్తి మండలం సన్నూరు శివారు సుభాష్‌తండాకు వస్తుండగా మార్గ మధ్యలో తొర్రూరు మండలంలోని మడిపెల్లి గ్రామశివారులోకి వెళ్లేసరికి ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడంతో ట్రాక్టర్ రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. ట్రాక్టర్ ఇంజన్‌పై కూర్చొని ఉన్న మంజుల జారి కింద పడడంతో ట్రాక్టర్ డబ్బా టైర్ తలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి సోదరుడు గుగులోతు భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు చెప్పారు.

చికిత్స పొందుతున్న మహిళ..

మహబూబాబాద్ రూరల్ : మండలంలోని మొట్లతండాకు చెందిన బాదావత్ సేలా (56) ఎంజీఎంలో చికిత్స పొందుతూ మృతి చెందిందని రూరల్ ఎస్సై వి.దీపిక బుధవారం తెలిపారు. ఈ నెల 10న సేలా తమ ఇంటి ఆవరణలోని పశువుల కొట్టంలో చెత్తను శుభ్రం చేస్తుండగా ఓ పశువు ఆమెను పొడిచింది. ఈ ఘటనలో ఆమెకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించటంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. మంగళవారం రాత్రి సేలా మృతిచెందగా భర్త బిక్కు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి పోస్టు మార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

దంతాలపల్లి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్థానిక పోలీసులు సీజ్ చేశారు. ఎస్సై పిల్లల రాజు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని దాట్ల గ్రామంలో ఇసుక అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు గ్రామానికి చేరుకుని ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. డ్రైవర్ మహేష్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

నల్ల బెల్లం, పటిక పట్టివేత

మరిపెడ/మరిపెడ రూరల్: అక్రమంగా తరలిస్తున్న 10 బస్తాల నల్లబెల్లం, 5 కిలోల పటికను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకొని, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీష్ బుధవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం...మండలంలోని చింతలగడ్డతండాకు చెందిన బానోతు నరేష్, బావోజిగూడెం శివారు వెంకురాంతండాకు చెందిన గుగులోతు దేవేందర్ ఓ ఆటోలో 10 బస్తాలు అంటే 5 క్వింటాళ్ల నల్ల బెల్లం, 5 కిలోల పటికను తరలిస్తున్నారు. పోలీసులు గిరిపురం శివారులో పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తుండగా బెల్లం, పటిక తరలిస్తున్న ఆటోను పట్టుకొని స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా బెల్లం తరలిస్తున్న సదురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బొమ్మకల్లులో షార్ట్‌సర్క్యూట్

పెద్దవంగర: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఓ ఇంట్లో ఆస్తి నష్టం జరిగి సంఘటన మండల పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఆర్ఐ లస్కర్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బొమ్మకల్లుకు చెందిన ఎర్వాని సమ్మయ్య పనుల నిమిత్తం బయటకు వెళ్లాడు. బుధవారం రాత్రి వివాహ వేడుకల్లో భాగంగా గ్రామంలో బరాత్ జరుగుతుండగా నృత్యాలు చూసేందుకు పిల్లలు బయటకు వెళ్లగా వారిని తీసుకొచ్చేందుకు కుటుంబ సభ్యులు వెళ్లారు. అంతలోనే ఫ్రిడ్జ్, నిత్యావసర వస్తువులు బియ్యం, దగ్ధమయ్యాయి.

గడ్డివాములు దగ్ధం

మరిపెడ రూరల్ : గ్రామ పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంతో ఆరు గడ్డివాములు కాలి బూడిదైన సంఘటన మండలంలోని తండధర్మారం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. తండధర్మారం గ్రామ పంచాయతీకి చెందిన రైతులు గుగులోతు భగవాన్, గుగులోతు హచ్చు, గుగులోతు దేవేందర్, గుగులోతు ధర్మా గ్రామ శివారు రోడ్డు సమీపంలో 6 గడ్డివాములను పేర్చుకున్నారు. ఈ క్రమంలో గ్రామ పంచాయతీ మల్టిపర్పస్ వర్కర్లు గ్రామ పురవీధులను శుభ్రం చేసి చెత్తను కాల్చారు. చెత్తకు పెట్టిన మంటలు రో డ్డు వెంట పేర్చుకున్న గడ్డివాములకు వ్యాపించాయి. సమాచారం మేరకు ఫైర్‌స్టేషన్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ సుమారు 1200 గడ్డిమోపులు కాలి బూడిదయ్యాయి.

కాపర్‌వైరు అపహరణ

నర్సింహులపేట: నర్సింహులపేట శివారు ఎర్రలచ్చయ్యగూడెం(బంజర)లోని ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైరును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు ఎస్సై మాలోతు సురేశ్ తెలిపారు. బుధవారం బంజరలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆఫ్ చేసి అందులోని సుమారు రూ. 20వేల విలువ చేసే కాపర్ వైరును ఎత్తుకెళ్లారు. విద్యుత్ సిబ్బంది సాయంత్రం మరమ్మతుల కోసం ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి చూడడంతో అందులోని కాపర్ వైరు కన్పించకపోవడంతో లైన్‌మెన్ చలమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే షాపు సీజ్



ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకుంటున్న మున్సిపల్ సిబ్బంది

మహబూబాబాద్ : కవర్లు విక్రయిస్తే జరిమాన విధించడంతో పాటు షాపులను సీజ్ చేయడం జరుగుతుందని సానిటరీ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ హెచ్చరించారు. మున్సిపాలిటీ పరిధిలోని పాతబజార్‌లోని పలు షాపులను బుధవారం మున్సిల్ అధికారులు తనిఖీ చేసి నాలుగు కిలోల ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుని జరిమాన విధించారు. కార్యక్రమంలో పర్యావరణ అధికారి గుజ్జు క్రాంతి, హెల్త్ అసిస్టెంటు శ్రీధర్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీ సిబ్బంది తనిఖీలు

డోర్నకల్ : పట్టణంలోని వివిధ రకాల షాపుల్లో బుధవారం మున్సిపాలిటీ సిబ్బంది తనిఖీలు నిర్వహించి ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనపర్చుకున్నారు. కిరాణా షాపులు, హోటళ్లు, జ్యూస్ పాయింట్లలో తనిఖీలు నిర్వహించి ప్లాస్టిక్ గ్లాసులు, కవర్లను స్వాధీనపర్చున్నారు. ప్లాస్టిక్ వస్తువులు వినియోగించే వారిపై చర్యలు తీసుకుంటామని సీనియర్ అసిస్టెంట్ నాగరాజు, హెల్త్ అసిస్టెంట్ అహ్మద్ హెచ్చరించారు.